## క్లుప్తంగా

### క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న చైర్మన్, నాయకులు

**జమ్మికుంట:** రైతులకు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ పానగంటి సంపత్ అన్నారు. గురువారం జమ్మికుంట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) 2023 క్యాలెండర్ ఆవిష్కరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతుబంధు, రైతుబీమా, ధాన్యం కొనుగోళ్లు, సకాలంలో ఎరువులు అందజేస్తు, వ్యవసాయ రంగానికి వెన్నుదన్నుగా ప్రభుత్వం పనిచేస్తుందని కొనియాడారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, డైరెక్టర్లు మీరుపాల తిరుపతిరావు, పోతుల సమ్మయ్య, తిరుపతి, శ్రీలత, రమాదేవి, అయిత కుమార్, సీఈవో ప్రకాష్‌రెడ్డిలతోపాటు తదితరులు పాల్గొన్నారు.

**డీటీఎఫ్ క్యాలెండర్..**

**వీణవంక:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డీటీఎఫ్ మండల అధ్యక్షుడు మ్యాకమల్ల శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి కనకం శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు పులి అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం డీటీఎఫ్ 2023 క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించి బదిలీలు, పదోన్నతులు చేపట్టాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు ఉదయం,సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నందున విద్యార్థులకు అల్పాహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సంపత్‌రెడ్డి, ఉపాధ్యాయులు లింగయ్య, రాజశేఖర్, జైపాల్‌రెడ్డి, ప్రవీణ్, జయ,సునిత, అరుణశ్రీ, వీరాచారి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### 'కంటి వెలుగు' సమష్టితో విజయవంతం చేయాలి

**సైదాపూర్:** రాష్ట్ర ప్రభుత్వం రెండోసారి నిర్వహించనున్న కంటి వెలుగు కార్యక్రమంపై గురువారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యాక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టి కృషితో విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గోపాల్‌రావు, ఎంపీడీవో పద్మావతి, హెల్త్ సూపర్‌వైజర్ సమ్మయ్య, మండల అధికారులు పాల్గొన్నారు.

### గ్లాసులు వితరణ

**వీణవంక:** మండలంలోని మల్లారెడ్డి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు సత్యసాయి ట్రస్ట్ ద్వారా రాగి జావ అందిస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం విద్యార్థులకు పీఆర్‌టీయూటీఎస్ మండల అధ్యక్షుడు అయిలేని కరుణాకర్‌రెడ్డి స్టీల్ గ్లాసులు అందించారు. రాగి జావ అందిస్తున్న ట్రస్ట్, గ్లాసులు అందించినందుకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మనోహర్‌రెడ్డి, ఉపాధ్యాయులు హైమవతి, రియాజుద్దీన్, తిరుపతిరెడ్డి, రమణారెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.

### ఎల్‌వోసీ అందజేత

**శంకరపట్నం:** రోడ్డు ప్రమాదంలో గుర్రం కనుకమ్మ కోమాలోకి వెళ్లి నిమ్స్‌లో చికిత్స పొందుతోంది. గురువారం రూ.1.50 లక్షల ఎల్‌వోసీని ఆమె కుటుంబ సభ్యులకు అందించామని ఆహారభద్రత కమిషన్ సభ్యుడు ఓరుగంటి ఆనంద్ తెలిపారు.

### బడీడు పిల్లలను గుర్తించిన సీఆర్పీలు



పాఠశాలలో చేర్పిస్తున్న సీఆర్పీలు

**హుజూరాబాద్‌రూరల్:** మండలంలోని తుమ్మనపల్లి గ్రామ శివారులోని ఇటుక బట్టీల ప్రాంతంలో గురువారం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం సీఆర్పీలు బడీడు పిల్లలను గుర్తించారు. ఈ సందర్భంగా ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కార్మికుల పిల్లలను సమీప గ్రామంలోని పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్స్ గుండా రాజిరెడ్డి, మాదం రవిబాబు, ఉపాధ్యాయులు శోభారాణి, తదితరులు ఉన్నారు.

### ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

**చొప్పదండి:** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కార్యకర్తలు సైనికుడిలా కష్టపడాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం కోరారు. మండలంలోని పెద్దకూర్మపల్లి గ్రామంలో గురువారం గ్రామస్థాయి నూతన కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఈనెల 26 నుంచి పాదయాత్ర ద్వారా ప్రజల్లోకి వస్తున్నారని, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. కాంగ్రెస్‌తోనే పేదవారికి న్యాయం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షు డు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, ముద్దం తిరుపతిగౌడ్, కొట్టె అశోక్, కుకట్ల రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ యువజన దినోత్సవం

చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లో గురువారం స్వామి వివేకానందుని జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటం, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. దేశ భవిష్యత్ యువతపై ఆధారపడి ఉందని, వివేకానందను స్ఫూర్తిగా తీసుకొని నేటి యువతరం ముందుకు సాగాలని పలువురు పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో క్రీడా సామగ్రి, దుప్పట్లు పంపిణీ చేశారు. చిగురుమామిడి మండలం నవాబుపేట్‌లో 2 కె రన్, జమ్మికుంటలో 5 కె రన్ నిర్వహించారు. హుజూరాబాద్ పట్టణంలో వివేకానంద విగ్రహాన్ని పునః ప్రతిష్ఠించారు. అంబేడ్కర్ జంక్షన్ సమీపంలో అమరవీరుల స్తూపం వద్ద పునః నిర్మాణానికి భూమిపూజ చేశారు. యువతకు దిశా నిర్దేశం చేసిన విషయాలను గుర్తుచేశారు. విద్యార్థులకు వివిధ రకాలు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, టీచర్లు, వి విధ పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



రామడుగు: వెదిర క్రాస్ రోడ్డులో వివేకానంద విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్



గన్నేరువరంలో..



హుజూరాబాద్‌లో వివేకానందుడి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు



హుజూరాబాద్‌రూరల్: చెల్పూర్‌లో నివాళులర్పిస్తున్న సర్పంచ్ మహేందర్‌గౌడ్



శంకరపట్నం: కేశవపట్నంలో నివాళి అర్పిస్తున్న ఎంపీటీసీ అనిల్

# ఇదెక్కడి చోద్యం..

- ఇల్లు లేకున్నా ఇంటి నంబర్ కేటాయింపు
- చొప్పదండి మున్సిపాలిటీలో అవినీతి బాగోతం
- రెండు నెలల క్రితం వెలుగులోకి
- ఇంటికి సంబంధించి ఆన్‌లైన్‌లో బిల్లులు చెల్లించిన వైనం
- చర్యలు తీసుకోవడంలో అధికారుల మీనమేషాలు



చొప్పదండి మున్సిపల్ కార్యాలయం

**చొప్పదండి:** నిర్మించని ఇల్లు... కనీసం స్థలం కూడా చూడకుండానే చొప్పదండి మున్సిపల్ అధికారులు ఆన్‌లైన్‌లో ఇంటి నంబర్ కేటాయించారు. ఆరో వార్డు పరిధిలో రెండు నెలల క్రితం వెలుగులోకి రాగా చర్యలు తీసుకోవడంలో సంబంధితశాఖ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇటీవల పట్టణంలో ఇంటి పన్నులు పెరిగాయని ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో వరుసగా ఆందోళనలు చేశారు. పెరిగిన పన్నులు ఇంటి నంబర్ల వారీగా పరిశీలించడంతో బాగోతం బయటపడింది. మున్సిపల్‌శాఖ ఉద్యోగుల సహకారంతో ఆన్‌లైన్‌లో ఇంటి నంబర్ కేటాయించినట్లు స్పష్టమవుతున్నా ఆ ఇంటి నంబర్‌ను రద్దు చేయడం, అక్రమాలకు పాల్పడిన ఉద్యోగులపై చర్యలు తీసుకోకపోవడంపై పట్టణ ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

### కార్యాలయంలో నమోదు లేదు

మున్సిపల్ అధికారులు ఇంటి నంబర్ కేటాయించేటప్పుడు మున్సిపల్ కార్యాలయంలోని రికార్డుల్లో నమోదు చేస్తారు. ఇంటి నంబర్లకు సంబంధించి కార్యాలయంలో ఎటువంటి రికార్డులు లేవని మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు గుర్తించారు. ఇల్లు కట్టకుండానే సిబ్బంది లాలూచీ పడి నంబర్ కేటాయించడంతోపాటు ఇంటికి సంబంధించి ఆన్‌లైన్‌లో బిల్లులు కట్టించారు. మున్సిపల్ సిబ్బంది సహకారంతోనే ఇది జరిగినట్లు స్పష్టమవుతోంది.

### ఫిర్యాదుతో విచారణ

మున్సిపల్ కార్యాలయంలో అవినీతిపై, ఇంటి నంబర్ కేటాయింపుపై స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు పలుమార్లు విచారణ జరిపారు. ఆన్‌లైన్ ఇంటి నంబర్‌కు సంబంధించి కార్యాలయంలో ఎటువంటి పత్రాలు లభ్యం కాకపోవడం, నంబర్ పొందిన యజమాని నుంచి కూడా ఎటువంటి పత్రాలు లభ్యం కాకపోవడంతో అధికారులు చర్యలకు ఉపక్రమించారు. ఆన్‌లైన్ నుంచి ఇంటి నంబర్ రద్దు చేసి స్థలం కూడా లేకుండా నంబర్ పొందారని నిర్ధారించేందుకు అధికారులు నోటీసులు కూడా జారీ చేశారు. పలుమార్లు నోటీసులు జారీ చేసినా రెండు నెలలుగా చర్యలు మాత్రం తీసుకోవడం లేదు.

### సూత్రధారి ఎవరు..?

మున్సిపల్ కార్యాలయంలో అవినీతికి తెర తీయడం వెనుక సూత్రధారి ఎవరనేది ఇప్పుడు మిస్టరీగా మారింది. ఎటువంటి విచారణ, ధృవీకరణ పత్రాలు పొందుపరచకుండా అవినీతికి పాల్పడిన వారిని గుర్తించడం ఇప్పుడు అధికారులకు సవాల్‌గా మారింది. రెండున్నరేళ్ల క్రితం ప్రస్తుత అధికారులు, సిబ్బందే అక్రమాలకు తెర తీశారా లేక బదిలీపై వెళ్లిన వారు చేశారా అనేది తేలాల్సి ఉంది. సదరు ఇంటి నంబర్ కేటాయించిన సమయంలో సెల్ఫ్ అసెస్‌మెంట్ విధానం లేకపోవడం మరింత అనుమానాలకు తావిస్తోంది. నంబర్ కేటాయింపేనా ఇంకా కొన్ని నంబర్లు సృష్టించారా అనేది విచారణ జరిపితే బయటపడే అవకాశం ఉంది.

### చర్యలు తీసుకుంటాం



ఆరోవార్డులో అనుమతి లేకుండా ఇంటి నంబర్ కేటాయింపు, కార్యాలయంలో ఎటువంటి పత్రాలు లభ్యం కాకపోవడంపై ఫిర్యాదు వచ్చింది. పూర్తి స్థాయిలో విచారణ జరిపి నంబర్ రద్దు చేస్తాం. న్యాయపరమైన చిక్కులు ఎదురుకాకుండా చూస్తున్నాం.

– శాంతికుమార్, మున్సిపల్ కమిషనర్

## సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తి చేయాలి



చొప్పదండి: కంకర పోస్తున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

**చొప్పదండి:** మున్సిపాలిటీలో రూ.33 కోట్లతో చేపట్టిన సెంట్రల్ లైటింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆదేశించారు. గురువారం పనులు పరిశీలించి డ్రెయినేజీ పనులకు కంకర మోశారు. మున్సిపాలిటీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, నిబంధనల మేరకు పనులు పూర్తి చేయిస్తామన్నారు. వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, వైస్ చైర్ పర్సన్ ఇప్పనపల్లి విజయలక్ష్మి, ఏఎంసీ వైస్ చైర్మన్ చీకట్ల రాజశేఖర్, కౌన్సిలర్‌లు టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

**పల్లెల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం**

**గంగాధర:** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని పెద్ద ఆచంపల్లి గ్రామంలో రూ.4.60 లక్షలతో నిర్మించనున్న మహిళా సంఘం భవన నిర్మాణ పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్లెల్లో సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి పనులకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తుందన్నారు. హరితహారం, పల్లె ప్రకృతివనాల ఏర్పాటు, మిషన్ కాకతీయతో చెరువుల్లో పూడిక తీశామన్నారు. నూతనంగా ఏర్పాటైన కొత్త పంచాయతీలకు, అన్ని కుల సంఘం భవనాలకు నిధులు మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

### రోడ్డును పరిశీలించిన ఈఎన్‌సీ అధికారి



వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

**జమ్మికుంట:** జమ్మికుంట, వావిలాల ఆర్అండ్‌బీ రోడ్డును ఇంజినీర్ ఇన్ చీఫ్ ఆర్అండ్‌బీ డిపార్ట్‌మెంట్ (ఈఎన్‌సీ) హైదరాబాద్ అధికారి రవీందర్‌రావు గురువారం పరిశీలించారు. మానేరు పరివాహక ప్రాంతంలోని ఇసుక క్వారీలకు వెళ్తున్న లారీ వల్ల రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని, రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆయా గ్రామాల సర్పంచులు నవంబర్‌లో ఫిర్యాదు చేశారు. క్రమంలో ఈఎన్‌సీ అధికారి రవీందర్‌రావు, సూపరింటెండెంట్ చందరసింగ్, ఈఈ సాంబయ్య, డీఈ బాపురావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీపీ దొడ్డె మమతప్రసాద్, మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపెల్లి రాజేశ్వర్‌రావు, వైస్ చైర్మన్ దేశిని స్వప్నకోటి, కౌన్సిలర్లు రోడ్డు వల్ల జరిగే నష్టాలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

### మదర్స్ డే వేడుకలు

**హుజూరాబాద్:** సమాజంలో తల్లి పాత్ర వెలకట్టలేనిదని మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక స్పష్టం చేశారు. గురువారం పట్టణంలోని కాకతీయకాలనీ మాంటిస్సోరీ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో మాంటిస్సోరీ విద్యాసంస్థల చైర్మన్ జోస్ నెడుంతుండం ఆదేశాల మేరకు హెచ్‌ఎం గీతా షాజు అధ్యక్షతన మదర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా రాధిక మాట్లాడుతూ... తల్లి లేని ఇంటిని ఊహించుకోవడం కష్టమని, తల్లుల సంరక్షణలోనే చిన్నారులు సమృద్ధిగా ఎదుగుతారని స్పష్టం చేశారు. విద్యార్థులు తల్లిదండ్రులను గౌరవించాలని, వారి మాటలు పెడచెవిన పెట్టొద్దని సూచించారు. ఏటా మాతృమూర్తుల దినోత్సవం పురస్కరించుకొని పాఠశాల యాజమాన్యం ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థుల తల్లులకు ఆటపోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ షాజు థామస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### మురుగునీటిలో మంచినీటి నల్లా వాల్వ్



**చొప్పదండి:** పట్టణంలో పలుచోట్ల డ్రెయినేజీలు లేక మురుగునీరు నిలుస్తోంది. వివేకానంద చౌరస్తాలో మంచినీరు సరఫరా చేసే గేటు వాల్వ్ మురుగునీటిలో మునిగిపోయింది. అదే చోట ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ గురువారం స్వామి వివేకానంద జయంతిలో పాల్గొన్నారు. స్థానికులు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్‌ను ఆదేశించారు. కలుషితనీరు సరఫరా అయితే ప్రజల పరిస్థితి ఏంటని స్థానికులు ప్రశ్నించారు.

## ఆధ్యాత్మికం

### రేపటి నుంచి వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు





ఉత్సవాలకు ముస్తాబైన దేవాలయం (ఇన్‌సెట్లో) నందగిరి వీరభద్రుడు

**గంగాధర:** భక్తుల పాలిట కొంగు బంగారంగా వెలుగొందుతున్న మండలంలోని కోట్ల నర్సింహులపల్లి గ్రామంలో ఉన్న నందగిరి వీరభద్ర స్వామి వార్షికోత్సవాలు శనివారం నుంచి ఐదు రోజులపాటు నిర్వహించనున్నామని ఆలయ వంశపారంపర్య పూజారి పొరండ్ల శ్రీనివాసశర్మ, సర్పంచ్ తోట కవితమల్లారెడ్డి తెలిపారు. ఏటా జనవరిలో ఐదు రోజుల పాటు వార్షికోత్సవాలు వైభవంగా నిర్వహిస్తామన్నారు. మొదటి రోజు గంగాజల సేకరణ, ధ్వజశోభాయాత్ర, ధ్వజారోహణ, మంటపప్రవేశం, గణపతిపూజ, స్వస్తిపుణ్యాహచనం, అంకురార్పణ, కళశ స్థాపన, హోమం, తీర్థప్రసాదాల వితరణ, రెండో రోజు స్థాపిత దేవతారాధన, నిత్యపూజ, హోమం, అభిషేకము, కుంకుమపూజ, పల్లకీసేవ, రథోత్సవం, బలిహరణ, మూడో రోజు నిత్యపూజ, అభిషేకం తరువాత రుద్రోత్సవం, నవగ్రహ హో మం, విశేషకుంకమ పూజ, రథోత్సవం, భజనలు, నాల్గోరోజు ఉదయం వేదవచనం, దేవతారాధన, భద్రకాళి హోమం, సాయంత్రం శివకళ్యాణం, భద్రకాళిపూజ, ప్రభలు, అగ్నిగుండ ప్రజ్వలన, పల్లకి సేవ, ఐదోరోజు 18న ఉదయం అగ్నిగుండాలు, ఏకాదశ రుద్రాభిషేకం, శ్రీవీరభద్రస్వామి వారికి అన్నపూజ, తీర్థప్రసాద వితరణతో ఉత్సవాలు ముగిస్తాయని పేర్కొన్నారు. వార్షికోత్సవాల్లో చివరి నాలుగు రోజులు అన్నదాన కార్యక్రమంతో పాటు సాంస్కృతిక కార్యాక్రమాలుంటాయని, ఉత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని రకాల వసతులు, ఏర్పాట్లు చేశామన్నారు.

## సమాచారం..

### మోడల్ స్కూల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

**చిగురుమామిడి:** మండలంలోని చిన్నముల్కనూర్ ఆదర్శ పాఠశాల ఆరోతరగతి(2023–24)లో ప్రవేశానికి విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్ కోరారు. గురువారం చిన్నముల్కనూర్‌లో మాట్లాడారు. వంద సీట్లు ఉన్నాయని, 7,8,9,10 తరగతుల్లో ఏర్పడే ఖాళీలకు ఫిబ్రవరి 15వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 16న ప్రవేశ పరీక్షకు నిర్వహిస్తామన్నారు.

## వైఎస్సార్‌టీపీలో మహిళల చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న సత్యరాజ్‌వర్మ, తదితరులు

**చొప్పదండి:** వైఎస్సార్‌టీపీ అధినేత్రి షర్మిలరెడ్డి నేతృత్వంలో రాబోయే ఎన్నికల్లో నిరంకుశ ప్రభుత్వానికి చరమ గీతం పాడి విజయ దుందుభి మోగిస్తామని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తడగొండ సత్యరాజ్‌వర్మ, ఎస్ఆర్ఐ గాదె స్రవంతి అన్నారు. మండలంలోని ఆర్నకొండలో వైఎస్సార్ చౌరస్తాలో గురువారం కొడిమ్యాల, రామడుగు మండలాలలకు చెందిన మహిళలు పార్టీలో చేరారు. వైఎస్సార్‌టీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చొప్పదండి అభివృద్ధిపై సవతి ప్రేమను చూపుతున్న వారికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని విమర్శించారు. షర్మిల యాత్రను చూసి అధికార పార్టీ నాయకుల గుండెల్లో గుబులు మొదలైందని, అప్రజాస్వామికంగా యాత్రను అడ్డుకుంటున్నా ప్రజల గుండెల్లో అభిమానాన్ని అడ్డుకోలేరన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి జీవితం అంకితం చేయడానికే షర్మిల రాజకీయాల్లోకి వచ్చారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలశాఖ అధ్యక్షుడు సింగిరెడ్డి రాజేందర్ రెడ్డి, రామడుగు మండల నాయకురాలు ఎలిగేటి లత, ఎస్సీ సెల్ మండల శాఖ అధ్యక్షుడు మోదుంపల్లి శ్రీకాంత్, కుక్కల పెద్ద లచ్చవ్వ, తదితరులు పాల్గొన్నారు.


## ముందస్తు సంక్రాంతి వేడుకలు



హుజూరాబాద్‌రూరల్: కాట్రపల్లిలో ముగ్గుల పోటీలు



గంగాధరలో భోగిమంటలు



జమ్మికుంట గర్ల్స్ హైస్కూల్‌లో ముగ్గులు వేస్తున్న విద్యార్థులు

చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కేజీబీవీలో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. భోగి మంటలు వేశారు, ఉపాధ్యాయులు సంక్రాంతి పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. సంస్కృతి, సంప్రదాయాలను నేటి తరానికి తెలియజేస్తూ వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పలువురు విద్యార్థులు సంక్రాంతి పండుగ ప్రాముఖ్యతను తెలిజేసే ముగ్గులు వేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. – సాక్షి నెట్‌వర్క్